క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన మద్దిపాడు ఎంపీడీఓ


ఎంపీడీఓ జ్యోతి

మద్దిపాడు: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వీ జ్యోతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె గత సంవత్సరం ఎంపీడీఓగా ఉద్యోగం సాధించి నెల్లూరు జిల్లా అల్లూరులో ఎంపీడీఓగా పని చేస్తూ ఎన్నికల అనంతరం బదిలీపై మద్దిపాడు వచ్చారు. గ్రామ కార్యదర్శులు, పలువురు వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఆమెను కలిసి అభినందనలు తెలిపారు.

సుధాకర్ ప్రసాద్‌కు జేసీ నివాళి


నివాళులర్పిస్తున్న జేసీ, ఏపీఆర్ఎస్ఏ నాయకులు

ఒంగోలు అర్బన్: కామ్రేడ్ తోట సుధాకర్ ప్రసాద్ 23వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక రెవెన్యూ భవన్ ప్రాంగణంలో ఉన్న ఆయన విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జేసీ గోపాలకృష్ణ హాజరై విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కృషి చేసిన వ్యక్తి సుధాకర్ అని అన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, కోశాధికారి డానియేలు, కలెక్టరేట్ అధ్యక్షుడు ఊతకోలు శ్రీనివాసరావు, ఇతర నాయకులు జయలక్ష్మి, కొండపి వెంకటేశ్వరరావు, ఏవీబీ రాజేష్, కె.కాశయ్య, వెంకటేశ్వరరాజు, ప్రసన్నాంజనేయకుమార్, కోమటికుంట వెంకటేశ్వర్లు, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మల్లవరంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల ప్రత్యేక పూజలు

మద్దిపాడు: మండలంలోని మల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణకోటిరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున హాజరవుతారని, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలంతా హాజరు కావాలని కోరారు.

సిండికేట్ సొసైటీ రైతుల నిరసన


సొసైటీ భవనం ఎదురుగా నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

చీమకుర్తి: సంతనూతలపాడులోని సిండికేట్ సొసైటీ రైతులు శుక్రవారం సొసైటీ భవనం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సొసైటీ భవనం వద్దకు ఎరువులను లారీలలో తీసుకొచ్చేందుకు భవనం ఎదురుగా సైడు కాలువలు ఆటంకం కలిగిస్తుండటంతో ఎరువుల లారీలు రాలేకపోతున్నాయని వారు వాపోయారు. సైడు కాలువ వద్ద లారీలు వచ్చేందుకు ఇబ్బంది లేకుండా సొసైటీ తరఫున పనిచేస్తుంటే.. పంచాయతీ అధికారులు సైడు కాలువలున్న స్థలం పంచాయతీకి సంబంధించిందని సొసైటీ అధికారులను సైడు కాలువ వద్ద పనులు చేయనివ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీ ద్వారా ఎరువులను రైతులకు తక్కువ ధరలకే ఇస్తుంటే రైతులకు మేలు జరగకుండా, లారీలను రానీయకుండా ఇబ్బంది పెడుతున్నారని రైతులు శ్రీరామ్‌మూర్తి, శంకర్‌బాబు, శ్రీనివాసరావు, తదితరులు నిరసన వ్యక్తం చేశారు.

ఇల్లు ఉంటే పన్ను వేయాల్సిందే...


ఇంటి పన్ను వేయలేదని కమిషనర్‌కు కాగితాలు చూపిస్తున్న 16వ డివిజన్ కార్పొరేటర్ నాగభూషణం

ఒంగోలు సబర్బన్: నగరంలో ఇల్లు ఉంటే పన్ను వేయాల్సిందేనని అధికారులు, సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. నగరంలోని 16వ డివిజన్‌తో పాటు పలు ప్రాంతాల్లో పన్నుల వసూళ్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డ్రైవ్‌లో శుక్రవారం కమిషనర్ పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో పన్ను వేయని ఇళ్ల గురించి ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఏం జరిగిందో తనకు అనవసరమని, ఇక నుంచి మాత్రం కచ్చితంగా పన్ను వేయాల్సిందేనని హెచ్చరించారు. పన్ను వేయమన్నా.. వేయలేదని ప్రజల నుంచి తనకు ఫిర్యాదులు రాకూడదన్నారు. సాంకేతికపరమైన అంశాలుంటే వాటిని ఏ విధంగా పరిష్కరించాలో చూసుకోవచ్చన్నారు. బాలాజీ కాలనీ, దత్తాత్రేయ కాలనీ ప్రజలు పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. సుమారు 20 ఇళ్లకు ఇంటి పన్ను వేయలేదని, పన్ను వేయించాలని, ఇంటిపన్ను కడుతున్న వారి పేరు పన్ను రసీదులో వచ్చేలా చూడాలని కమిషనర్‌ను కోరారు. ఎవరైతే ప్రైవేట్ భూమి ఉండి ఇళ్లు కట్టుకున్నారో వారి పేరు మీద పన్ను రసీదు ఇస్తామని, డీకే పట్టాలలో ఇళ్లు కట్టుకున్న వారికి ది హోల్డర్ అఫ్ ది ప్రమిసిస్ అని పన్ను రసీదు ఇస్తామని కమిషనర్ తెలిపారు. బత్తులవారి కుంటను శుభ్రం చేసి నీటితో నింపాలని స్థానికులు కోరారు. మంచినీటి కోసం పైప్‌లైన్లు ఏర్పాటు చేయించాలని దత్తాత్రేయకాలనీవాసులు కోరారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా నగరంలోని మాతాశిశు వైద్యశాల, చర్చి, శివాలయం తదితర ప్రదేశాలలో జరుగుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు చేశారు. కమిషనర్ వెంట 16వ డివిజన్ కార్పొరేటర్ నాగభూషణం, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.పిచ్చయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బహుజన గిరిజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లక్కేపోగు


వెంకటరావుకు నియామకపత్రం అందజేస్తున్న సుబ్బారావు

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ బహుజన గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లక్కేపోగు వెంకటరావును నియమించారు. ఆ మేరకు స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ.. లక్కేపోగు నిబద్ధత కలిగిన దళిత నాయకుడని, ప్రకాశం జిల్లాలో దళితుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో బహుజన, గిరిజన ఐక్యవేదిక బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

దాత సహకారంతో ప్రభుత్వ హైస్కూలుకు వంటగది


వంట గదిని ప్రారంభిస్తున్న చలువాది బదరీనారాయణ, డాక్టర్ జవహర్

చీమకుర్తి: చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలులో వంట గది నిర్మాణానికి రూ.5 లక్షల విరాళాన్ని పాఠశాలలో 1962–68లో విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థి చలువాది వెంకటేశ్వరరావు అందించారు. ఆ నిధులతో నిర్మించిన వంటశాలను స్థానిక లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీ జవహర్, గ్రానైట్ యజమాని చలువాది బదరీనారాయణ చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైరైన చలువాది వెంకటేశ్వరరావు వంటశాలకు ఆర్థిక సహకారం అందించిన సందర్భంగా ఆయనతో పాటు చదువుకున్న పూర్వ విద్యార్థులు, స్థానిక నాయకుల సమక్షంలో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, చలువాది రమేష్, నూనె సుబ్రహ్మణ్యం, స్థానికులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు


మిలిటరీ కాలనీలోని కనకదుర్గమ్మ దేవస్థానంలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

- శ్రీసూక్తంతో అభిషేకాలు

ఒంగోలు మెట్రో: నగరంలోని అమ్మవారి దేవాలయాల్లో శుక్రవారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కేశవస్వామిపేట చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఉపాలయంగా ఉన్న రాజ్యలక్ష్మి అమ్మవారికి, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న నాగలక్ష్మి అమ్మవారికి, బాలాజీరావుపేట కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో, లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారికి, కేశవస్వామి పేటలోని విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో, సమతానగర్లోని శ్రీ కనకదుర్గమ్మకు, గద్దలగుంట బుర్ర బావి దగ్గర మహాలక్ష్మి మహాకాళి మహాసరస్వతి దేవస్థానంలో, మంగమూరు రోడ్డులోని గాయత్రి మందిరంలో, శివప్రసాద్ కాలనీలోని పోలేరమ్మ దేవస్థానంలో, కొప్పోలు చెన్నకేశవస్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి, యానాది సంఘం మిలిటరీ కాలనీలో కనకదుర్గమ్మకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా కొత్తపట్నం బస్టాండ్ వద్ద గల నల్లూరి నర్సింగ్ హోం దగ్గర శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలోనూ ఆలయ అర్చకులు సుగంధ పరిమళ ద్రవ్యాలు, శ్రీ సూక్తంతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్లను వివిధ రకాల పూలతో అలంకరించి అష్టోత్తర శతనామావళి పూజ క్రతువులు నిర్వహించారు. కర్పూర నీరాజన హారతులతో భక్తులకు అమ్మవారి దివ్యదర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆశీసులు అందుకున్నారు.

శక్తిసదన్ మహిళల స్వచ్ఛతా హి సేవ



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

ఒంగోలు మెట్రో: కేంద్ర ప్రభుత్వం పిలుపుమేరకు ఒంగోలులో ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శక్తిసదన్ మహిళలు శుక్రవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక 19వ డివిజన్‌లోని పాలిటెక్నిక్ కాలేజీ ఆవరణలో వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేశారు. సమితి అధ్యక్షురాలు తేళ్ల అరుణ, మాజీ ఎంపీపీ చిరుతోటి నరసమ్మ, సమితి కోశాధికారి బీరం అరుణ, శక్తిసదన్ వార్డెన్ కే శాంతిలత, మలాన్ భాను, సీహెచ్ కనకదుర్గ, గుంటుపల్లి శ్రీదేవి, పరుచూరి నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ కో ఆర్డినేటర్‌గా నైనాల


నైనాల రామకృష్ణ

ఒంగోలు టౌన్: రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు సీనియర్ కో ఆర్డినేటర్‌గా నైనాల రామకృష్ణను నియమించారు. రామకృష్ణ గతంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్‌గా, రెడ్ క్రాస్ పాలకమండలి సభ్యుడిగా పనిచేశారు. కలెక్టర్ బంగ్లా వెనుకవైపు ఉన్న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకును కొత్త కూరగాయల మార్కెట్‌లోకి మార్చి ఆధునిక వైద్య పరికరాలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బ్యాంకు రోజువారీ కార్యక్రమాల నిర్వాహణకు రామకృష్ణను నియమించినట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాశ్ తెలిపారు. రామకృష్ణ నియామకంపై బ్లడ్‌బ్యాంకు కన్వీనర్ మంగళగిరి నరసింహారావు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి ఏఎన్‌ఎంల ఆన్‌లైన్ సేవలు బంద్


ఎంపీడీఓ కుసుమకుమారికి వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఏఎన్‌ఎంలు

కురిచేడు: మండలంలోని గ్రామ సచివాలయాలలో పనిచేసే ఏఎన్‌ఎంలు నేటి నుండి ఆన్‌లైన్ వర్క్ నిలిపివేస్తున్నట్లు ఎంపీడీఓ కుసుమకుమారికి శుక్రవారం నోటీసు అందజేశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఉద్యోగంలో చేరి వైద్యాధికారి పర్యవేక్షణలో తాము విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కానీ, ఆచరణలో మాత్రం సచివాలయం పనులు, ఆరోగ్య కార్యకర్త పనులు చేయిస్తున్నారని తెలిపారు. ఒకే సమయంలో రెండు శాఖల పనులు చేయడం కష్టంగా ఉన్నందున ఒత్తిడి పెరిగి మానసికంగా, శారీరకంగా రోగగ్రస్తులం అవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమను మాతృశాఖకు బదిలీ చేసి ఆరోగ్య కార్యకర్త విధులు నిర్వహించేలా మార్గనిర్దేశకాలు ఇవ్వాలని ఎంపీడీఓను కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు జి.బాలమరియమ్మ, బి.నాగమణి, కే అనిత, వి.పద్మావతి, వి.హరిత, కే కోటేశ్వరమ్మ, షేక్.పర్వీన్, షేక్.కాశింబీ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలి


ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

దర్శి: పరిసరాల పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.కిరణ్‌కుమారి సూచించారు. స్థానిక ఆ పాఠశాలలో శుక్రవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. చెట్లను పెంచాలంటూ విద్యార్థులు వివిధ ఆకృతుల్లో నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి పెంచాలని హెచ్‌ఎం సూచించారు. కార్యక్రమంలో పీడీ మాలకొండయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదానికి గురైన భారీ ట్యాంకర్

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


గుండ్లాపల్లి ఫ్లైఓవర్‌పై ప్రమాదానికి గురైన ట్యాంకర్

మద్దిపాడు: ఓ భారీ ట్యాంకర్ ప్రమాదానికి గురవగా, త్రుటిలో పెను ప్రమాదం తప్పిన సంఘటన జాతీయ రహదారిపై మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లి ఫ్లైఓవర్ మీద శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. ప్రమాదకరమైన ఆల్కహాల్ కంటెండ్‌తో ఒక భారీ ట్యాంకర్ విజయవాడ వైపు నుంచి ఒంగోలువైపు వెళ్తుండగా గుండ్లాపల్లి సమీపంలోని ఫ్లైఓవర్ వద్దకు వచ్చేసరికి డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టాడు. దాంతో ట్యాంకర్ అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కి నిలిచిపోయింది. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఒకవేళ ట్యాంకర్ తిరగబడి ఉంటే పెనుప్రమాదం జరిగి ఉండేదని అధికారులు తెలిపారు. ఎక్సైజ్ శాఖాధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించి వేరే ట్యాంకర్‌లోకి లిక్విడ్ మార్చే ప్రయత్నాలు చేస్తున్నారు. మద్దిపాడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మేస్త్రీలను పారిశుధ్య కార్మికులుగా వెళ్లమనడం సరికాదు

- కమిషనర్‌కు ఏపీ మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకుల వినతిపత్రం


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీ మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు

ఒంగోలు సబర్బన్: మేస్త్రీలను పారిశుధ్య కార్మికులుగా వెళ్లమనడం సరికాదని ఏపీ మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు శుక్రవారం ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. స్థానిక కమిషనర్ చాంబర్‌లో శుక్రవారం సీఐటీయూ నాయకులతో మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు కమిషనర్‌ను కలిశారు. నగర పాలక సంస్థలో పారిశుధ్య విభాగంలో మేస్త్రీలుగా విధులు నిర్వర్తిస్తున్న వారిని వద్దంటే వారి కుటుంబాలు నష్టపోతాయని తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా మేస్త్రీలుగా నగరంలో పనిచేస్తున్నారని, వారిని ఇప్పటికిప్పుడు పనులు మానేసి వెళ్లమంటే వాళ్ల జీవితాలు ఏం కావాలని అన్నారు. మేస్త్రీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో యూనియన్ నాయకులు కందుల ఆదినారాయణ, కే.శ్రీనివాసరావు, టి.మహేష్, తేళ్ల విజయ, గెడ్డం నరసింహ, శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం పొందేందుకు ప్రతిఒక్కరూ అర్హులే


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో వెంకట్రావు

నాగులుప్పలపాడు: అధికార యంత్రాంగం ద్వారా సమాచారాన్ని పొందే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందని మండల వ్యవసాయ శాఖాధికారి వెంకట్రావు తెలిపారు. సమాచార హక్కు చట్టం 2005పై స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ 2005 అక్టోబర్ 12 నుంచి అమల్లోకి వచ్చిన సమాచార హక్కు చట్టం అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడానికి, ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడానికి తోడ్పడుతోందన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సెక్షన్ 5(1) మేరకు సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి వివరాలను బోర్డులో ఉంచాలని తెలిపారు. దరఖాస్తుదారుడు అడిగిన సమాచారాన్ని 30 రోజుల్లోపు అందజేయాలని సూచించారు. ఈ చట్టం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగానికి సంబంధించిన ఎటువంటి సమాచారాన్ని అయినా పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీటీ జయలక్ష్మి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

దసరా శరన్నవరాత్రుల కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ ప్రతినిధులు

ఒంగోలు మెట్రో: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న శరన్నవరాత్రులకు సంబంధించిన కరపత్రాలను వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయ తదియారాధన సంఘ ప్రతినిధులు, వ్యవస్థాపక ధర్మకర్తలు చుండూరి శ్రీనివాసులు, పచ్చిపులుసు అనిల్ కుమార్, తదితరులు శుక్రవారం ఆవిష్కరించారు. ప్రతిరోజూ ఉదయం ఏడు గంటలకు అమ్మవారికి శ్రీ సూక్త సహితంగా నవరసాభిషేకాలు, ఉదయం పది గంటలకు అలంకరణ, సహస్రనామార్చన, మంత్రపుష్పము, తీర్థ ప్రసాదాల వితరణ జరుగుతాయన్నారు. సాయంత్రం ఏడు గంటలకు ప్రత్యేక భజన కార్యక్రమాలు, ఎనిమిది గంటలకు వాసవీ కోలాట భజన మండలి వారి కోలాటం, గుడి ఉత్సవం, మంత్రపుష్పం కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. ప్రతిరోజూ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో తదియారాధన సంఘ ప్రతినిధులు, వాసవీ కోలాట భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

నేడు చలివేంద్రలో జెడ్పీ చైర్‌పర్సన్ పూజలు

దర్శి: తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను, స్వామివారి ప్రసాదం విశిష్టతను, వెంకటేశ్వర స్వామి వైభవాన్ని, టీటీడీ పేరుప్రఖ్యాతులను, లడ్డూ పవిత్రతను కాపాడాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శనివారం చలివేంద్ర కొండపై ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. రాజకీయ దుర్బుద్ధితో ఉద్దేశపూర్వకంగా లడ్డూ తయారీలో జంతువుల కొవ్వుతో కల్తీ జరిగిందని, ఆ ప్రసాదాన్ని భక్తులు తిన్నారని సీఎం చంద్రబాబు అసత్యప్రచారం చేసి తిరుమలను, తిరుమల లడ్డూను, వెంకటేశ్వరస్వామి విశిష్టతను అపవిత్రం చేశారన్నారు. చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం జరిగే పూజల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. చలివేంద్ర కొండపై జరిగే పూజా కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఆమె కోరారు.

దొనకొండ ఆలయాల్లో...

దొనకొండ: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పిలుపు మేరకు దొనకొండలోని అడ్డరోడ్డులో ఆనంద ఆశ్రమంలో శనివారం ఉదయం 9 గంటలకు పూజలు నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల మాజీ కన్వీనర్ కాకర్ల క్రిష్టారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, జగనన్న, బూచేపల్లి అభిమానులు, ప్రజలు భారీగా పాల్గొనాలని కోరారు.

బాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు నేడు గుడిలో పూజలు

యర్రగొండపాలెం: పవిత్రమైన తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంపై తప్పుడు వ్యాఖ్యలు చేసిన సీఎం నారా చంద్రబాబు నాయుడు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. ఈ మేరకు స్థానిక మిల్లంపల్లి వేణుగోపాల స్వామి ఆలయానికి వెళ్లే దారిలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని, మండలంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

పెన్షనర్ల సంఘ భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వండి

చీమకుర్తి: చీమకుర్తి మండల స్థాయిలో పెన్షనర్ల సంఘ భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని ఆ సంఘ ప్రతినిధులు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే చీమకుర్తి వచ్చిన సందర్భంగా కలిసిన వారిలో పెన్షనర్ల సంఘ నాయకులు మర్రి లక్ష్మీనారాయణ, బండ్ల డేవిడ్, తదితరులు ఉన్నారు.

నాగులుప్పలపాడు ఎంపీడీవోగా మహాలక్ష్మి

నాగులుప్పలపాడు: మండల ఎంపీడీవోగా నియమితులైన మహాలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న జయమణి సింగరాయకొండ బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో జయమణిని, నూతన ఎంపీడీవో మహాలక్ష్మిని సిబ్బంది అభినందించారు.

నేడు మహాకవి జాషువా జయంతి సభ

ఒంగోలు మెట్రో: స్థానిక ఒంగోలు సీవీఎన్ రీడింగ్ రూం పైఆవరణలో నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవయుగ కవి చక్రవర్తి విశ్వకవి గుర్రం జాషువా జయంతి సభను శనివారం సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మిడసల మల్లికార్జునరావు, కనమాల రాఘవులు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా ఆగమశాస్త్ర పండితులు, వైద్యులు డాక్టర్ పరాంకుశం కేశవాచార్యులు, నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, విశిష్ట అతిథులుగా శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, గుంటూరు సత్యనారాయణ తదితరులు పాల్గొంటారని తెలిపారు. కవులు, రచయితలు, కళాకారులు పాల్గొనాలని వారు కోరారు.

స్వచ్ఛతపై అవగాహన కలిగి ఉండాలి


మాచవరం పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


బీ నిడమానూరు పాఠశాలలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ సిబ్బంది

నాగులుప్పలపాడు: పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ యాకోబ్ అన్నారు. స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడంతో పాటు వాటిపై విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం వారిచే ప్రతిజ్ఞ చేయించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శివరాం ప్రసాద్, ప్రేమ్‌కుమార్, రాజకుమార్, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

బీ నిడమానూరు గ్రామంలో...

స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమంలో భాగంగా బీ నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు పరిసరాలను బాగుచేయడంతో పాటు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వడ్డిముక్కల శ్రీను, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, మండల కో ఆర్డినేటర్ అంజనేయులు, ప్రధానోపాధ్యాయుడు కరీం సాహెబ్, నన్నెబోయిన వెంకటప్పయ్య, సిబ్బంది పాల్గొన్నారు.